క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక తనిఖీ, మరమ్మతుల కారణంగా 57వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సెక్షన్, దుర్గాపురం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ముత్యాలంపాడు సెక్షన్ భగత్‌సింగ్ రోడ్డు పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని బీవీ సుధాకర్ తెలిపారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్, అలంకార్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

ఎంపీ కేశినేని నాని

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలని విజయవాడ ఎంపీ కేశినేని నాని ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీని అభ్యర్థించారు. దేశ ప్రజలు గర్వించదగ్గ మహోన్నత వ్యక్తిగా ఎన్టీఆర్ సామాన్య కుటుంబం నుంచి ఎదిగారని తెలిపారు. ప్రఖ్యాత సినీ నటుడుగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ చేసిన సేవలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తికి దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న ఇవ్వడమే నిజమైన నివాళి అన్నారు.

రేపు ఘంటసాల వర్ధంతి సభ

విజయవాడ కల్చరల్: ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాల సౌజన్యంతో తెలుగు కళావాహిని పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సభను సంగీత కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ చింతకాయల చిట్టిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన సభ సభ్యులు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పీ విజయబాబు, స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి పాల్గొంటారని పేర్కొన్నారు. గాయనీ గాయకులు సినీ గీతాలను గానం చేస్తారని తెలిపారు.

11 నుంచి నగరంలో రథయాత్ర



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో ఐదు అడుగుల శివసూర్యుడు విగ్రహ ప్రతిష్ట, కల్యాణ నవగ్రహ ప్రతిష్టలో భాగంగా ఇంటింటికీ సూర్యదర్శనం, ప్రతి ఇంటా ఆరోగ్యం కార్యక్రమం ద్వారా నగరంలో 58 రోజుల పాటు రథయాత్ర నిర్వహించనున్నట్లు పీఠాధిపతి శివాచార్య స్వామి తెలిపారు. ఏలూరు రోడ్డులోని శ్రీ శివజ్ఞాన పీఠంలో శుక్రవారం రథయాత్ర, శైవాగమ పూర్వక భార్య సహిత నవగ్రహ ప్రతిష్ట కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు 58 రోజుల పాట నగరంలో రథయాత్ర ద్వారా తొమ్మిది రకాల నవగ్రహ వ్రతములు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు శివజ్ఞాన పీఠంలో సంప్రదించాలని కోరారు. పీఠం గౌరవ సలహాదారుడు గుండు దిలీప్, ధర్మాధికారి పేర్ల శ్యాంప్రసాద్, సభ్యులు పాలడుగు హైమావతి, చెక్క గాయత్రి లక్ష్మీ, పీ కనకదుర్గ వాణి, టీ హేమలీల, మాణిక్యాంబ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అకాడమీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని కళాశాలలోని సాంస్కృతిక వేదికపై గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఆపాత మధురలో పేరుతో సాగిన కార్యక్రమంలో ఘంటసాల, బాలుతోపాటు సుశీల, ఎస్.జానకి, చిత్ర ఆలపించిన గీతాలను రమణ శీలం, నందితా జ్యోతి, గాగర్లపూడి నాగార్జున ఆలపించారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు లక్ష్మణరావు, జనరల్ సెక్రటరీ ఎస్.లలిత్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు తాతినేని శ్రీహరిరావు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి
- సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 28వ డివిజన్ భానూనగర్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ కనపర్తి కొండలరావుతో కలిసి ఆయన గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ భానూనగర్‌లో సమస్యలన్నింటిని సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడ రోడ్డు వేసేందుకు ప్రజలు ఎన్నుకున్న టీడీపీ కార్పొరేటర్ అడ్డుపడటం విచారకరం అన్నారు. కార్పొరేటర్ అంటే ప్రజలకు మంచి చేసేలా ఉండాలని.. అభివృద్ధిని అడ్డుకునేలా ఉండకూడదని అన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం జగనన్న ప్రభుత్వం పేదలకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. కోవిడ్ సమయంలో కనిపించని బోండా ఉమాకు ఇప్పుడు ఎన్నికల్లో ఓటు అడిగే అర్హత లేదన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని బోండా ఉమా తమ ప్రభుత్వంపై రాజకీయ ప్రయోజనాల కోసమే నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బోండా కాపుల కోసం ఏంచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని అర్థమయిన బోండా ఉమా మానసిక వత్తిడితో బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఎంత మంది కలిసి వచ్చినా ప్రజా మద్దతుతో సెంట్రల్ సీటును కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

పేద ప్రజల ఇళ్లను అడ్డుకున్నారు

సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన 8 వేల మందికి అమరావతిలో సొంతింటి కల సాకారం చేసేందుకు ఇంటిస్థలాలు కేటాయిస్తే టీడీపీ నేతలు కోర్టు ద్వారా అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి చేయడం టీడీపీ నేతలకు నచ్చదని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తుంటే టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరిట అందినకాడికి దోచుకున్నారని గుర్తు చేశారు. అనంతరం అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు గొర్లె రాము, వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ నాయకుడు రామును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పీవీకి భారతరత్న ప్రకటించడం హర్షణీయం

ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణులు పేర్కొన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించిన సందర్భంగా శుక్రవారం సత్యనారాయణపురంలోని శివాజీకేఫ్ సెంటర్ గిరివీధిలో పీవీ నరసింహారావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానిగా విప్లవాత్మక సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పీవీ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం తెలుగు జాతికే గర్వకారణం అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాసరావు, మైలవరపు రామకృష్ణ, సత్యవాణి, చాంద్‌శర్మ, సనత్ తదితరులు పాల్గొన్నారు.



పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీ జానారెడ్డి సూచించారు. కార్పొరేటర్ జానారెడ్డి పర్యవేక్షణలో స్థానిక దేవీనగర్ మూడో లైన్ ఖాళీ స్థలంలో పేరుకుపోయిన చెత్తాచెదారంను శుక్రవారం పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ చెత్తాచెదారం పేరుకుపోవడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సహకారంతో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామన్నారు. మురుగు కాలువలో మురుగు ప్రవాహానికి ఆటంకం కలిగేలా చెత్త వేయకూడదని సూచించారు. అలాగే వారంలో ఒక రోజు డ్రై డేగా పాటించి ఇంట్లోని నీటి నిల్వలను మార్చడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, దేవీనగర్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి

బెంజ్‌సర్కిల్ సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తేవాలి

పటమట(విజయవాడతూర్పు): బెంజ్ సర్కిల్ సర్వీస్ రోడ్ త్వరగా ప్రజలకి అందుబాటులోకి తీసుకురావాలని, అందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగర పర్యటనలో భాగంగా ఆయన బెంజ్ సర్కిల్ సర్వీస్ రోడ్డును నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) మేనేజర్, ఏపీసీపీడీసీఎల్ ఏఈ, పోలీస్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్వరగా రోడ్లు పూర్తి చేయాలని సూచించారు. వర్షపు నీరు నిలువకుండా ఉండేందుకు డ్రెయిన్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించే దిశగా సర్వీస్ రోడ్ నుంచి బెంజ్ సర్కిల్ హైవే లోకి వెళ్లేలా రహదారులను అనుసంధానం చేసేలా పోలీస్ విభాగంకు సూచించారు. రోడ్లు వేస్తున్న తరుణంలో ఎలక్ట్రిసిటీ పోల్స్ తో ఇబ్బంది ఉంటే ఏపీ సీపీడీసీఎల్ సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు. నిర్మాణాల్లో రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. డ్రెయిన్లు, రోడ్లు పూర్తి చేసిన తర్వాత కాలుష్యాన్ని తగ్గించేలా గ్రీనరీ ని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ–3 చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (పార్క్స్) ఏఎస్ఎన్ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, జాతీయ రహదారి మేనేజర్, ఏపీ సీపీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భక్తులతో పోటెత్తిన గుణదల కొండ





గురువులను ఆశీర్వదిస్తున్న విజయవాడ పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు; సమష్టి దివ్యబలిపూజ నిర్వహిస్తున్న రెవరెండ్ ఫాదర్ మండపాటి లూయిస్‌రాజు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- తిరునాళ్ల సందడి
- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహణ

గుణదల(విజయవాడ తూర్పు): మేరీమాత ఉత్సవాల ప్రారంభంతో గుణదల కొండ భక్తులతో పోటెత్తింది. మరియతల్లి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. మేరీమాతను దర్శించుకున్న భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించున్నారు. కరుణించు మేరీమాతా అంటూ ప్రార్థించారు. కొవ్వొత్తులు వెలిగిస్తూ, కొబ్బరికాయలు కొడుతూ, ఉయ్యాలలు కడుతూ మరియతల్లిని వేడుకుంటున్నారు. తిరునాళ్లలో చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు యాత్రికులకు నోరూరించే విధంగా ఉన్నాయి. ఏడాదికొక్కసారి మాత్రమే కనిపించే బెల్లపు బూందీ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నల్లని బెల్లపు చెరకులు, పిల్లలు అమితంగా ఇష్టపడే పీసు మిఠాయిలు, అందరూ ఇష్టపడే ఖర్జూరాలు , వేడి వేడి జిలేబీలు ఇలా పలు రకాల రుచులు ఆకట్టుకుంటున్నాయి. వీటిని ఆస్వాదిస్తూ యాత్రికులు సందడి చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. బిషప్ గ్రాసి పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటయిన వేదిక పై కళాకారులు చేస్తున్న ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాలకు భక్తులు తన్మయం పొందుతున్నారు. సంసోను డెలీల, లాజరు జీవిత సువిశేషాలను వివరిస్తూ చేసిన నృత్య రూపకాలు, నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొండపై మరియ తల్లిని దర్శించుకుని వచ్చిన భక్తులను ఆధ్యాత్మికంగా ప్రేరేపించి సేదదీర్చే విధంగా ప్రదర్శనలు సాగుతున్నాయి.



విద్యుద్దీపకాంతులతో గుణదల మేరీమాత గుడి

పుణ్యక్షేత్రంలో నేటి కార్యక్రమాలు

ఉదయం
6 గంటలకు – ఉదయకాల ప్రార్థన
7 గంటలకు – సమష్టి దివ్యబలి పూజ
10 గంటలకు– పవిత్రాత్మ నూత్నీకరణ ప్రార్థనలు
11 గంటలకు– భక్తి గీతాలు
11:30 లకు – దివ్యబలిపూజ దేవాలయములో

మధ్యాహ్నం
12 గంటలకు– కోలాటం
1 గంటలకు – సాంస్కృతిక కార్యక్రమాలు
2 గంటలకు – కోలాటం
3 గంటలకు – దివ్యబలిపూజ దేవాలయములో

సాయంత్రం
5 గంటలకు – పరిశుద్ధ జపమాల
6 గంటలకు – సమష్టి దివ్యబలిపూజ

రాత్రి
8:30 గంటలకు– గుణదలమాత సంక్షిప్త చరిత్ర
9 గంటలకు – అమృత వర్షిణి నృత్య రూపకం
10:30 గంటలకు – సోలు మనోపరివర్తనం ఏకపాత్రాభినయం
11:30 గంటలకు– పూల గంప – బుర్రకథ
ఒంటి గంటకు – లాజరు ధనవంతుడు – నాటకం



ప్రార్థనలలో పాల్గొన్న భక్తులు



గురువులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు



మరియమ్మ తల్లి విగ్రహం

అల్లాహ్ దీవెనలతో అత్యధిక మెజార్టీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అల్లాహ్ దీవెనలతో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని మక్కా మస్జీద్‌లో శుక్రవారం జరిగిన జుమ్మా నమాజ్‌లో ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ముస్లిం మైనార్టీల సంక్షేమాభివృద్ధికి కృషి చేసిన వారెవరైనా ఉన్నారంటే అది మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబమేనని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించి వారి గుండెల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలను అన్ని రంగాల్లో అగ్ర స్థానంలో నిలబెట్టి వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపారన్నారు. ఆ అల్లాహ్ దీవెనలు వైఎస్సార్ కుటుంబంపై ఎళ్లవేళలా ఉంటాయని తెలిపారు. ముందుగా మతగురువు షేక్ అక్లాస్ ప్రత్యేక దువా చేశారు. అనంతరం మస్జీద్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లాను ఘనంగా సన్మానించారు. మస్జీద్ కమిటీ పెద్దలు షేక్ సికిందర్, బాజీ, అహ్మద్, రహమ్‌తుల్లా బేగ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ ఉమర్‌ఖాన్, ఇసరపు రాజు, ఆదినారాయణ, బాల, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కే మన్యం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లాను సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం మెరుగు

పాయకాపురం(విజయవాడరూరల్): నులిపురుగుల నిర్మూలన వల్ల విద్యార్థుల్లో ఆరోగ్యం మెరుగు పడుతుందని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్ నందు విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలను విజయలక్ష్మి వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో నులిపురుగులను నిర్మూలించడం వలన జ్ఞాపకశక్తి చురుగ్గా పని చేస్తుందని అన్నారు. హైస్కూల్లో ప్రతీ విద్యార్థికి వైద్య సిబ్బంది నులిపురుగుల నిర్మూలన మాత్రలను వేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రాజా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.మోహన్ పాల్గొన్నారు. 64వ డివిజన్ వైఎస్సార్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాల్లోని పిల్లలకు, ఎలిమెంటరీ స్కూల్స్, హైస్కూల్స్‌లో మూడు వేల మంది విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలను వేసినట్లు డాక్టర్ రాజా వివరించారు.



పిల్లలకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేస్తున్న కార్పొరేటర్ విజయలక్ష్మి

రేపు ఉచిత వైద్య శిబిరం

విజయవాడ కల్చరల్: సత్యనారాయణపురం బాబూరావు మేడ కూడలిలోని వేదా హస్పిటల్ వారి 6వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వేదా హస్పిటల్ డైరెక్టర్ యడ్లపాటి శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుండె, కిడ్నీ, ఎముకలు, దంతం, జనరల్ వ్యాధులకు సంబంధించి వైద్య సలహాలు, మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ముందుగా 9618193027 నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన శ్రీదత్తసాయి మందిర వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరం వార్షికోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. బాబావారికి విశేషంగా 21 దివ్య ద్రవ్యములతో అభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. సాయి నక్షత్రమాలిక 10వ మహాయజ్ఞం 108వ పర్వం పారాయణం, సంకీర్తన, లక్ష్మీగణపతి హోమం, పూర్ణాహుతి జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబావారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం నక్షత్ర హారతి, పల్లకీసేవ జరిగాయి. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.



శ్రీదత్తసాయి మందిరంలో బాబావారు

మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ కే ప్రియాంక అన్నారు. రాజీవ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్, ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుందన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారిని డీ–ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ చికిత్స కోసం విజయవాడ పెజ్జోనిపేటలోని నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. నవజీవన్ బాలభవన్ నూజివీడులో బోస్కో డీ–ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందన్నారు. ఇతర వివరాలకు 9490492020 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడ హనుమాన్ నృత్య కళా నిలయంకు చెందిన పలువురు చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శుక్రవారం సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

ఆనందమాయి అమ్మ ఆరాధన దినోత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఆనందమాయి అమ్మ ఆరాధన దినోత్సవం జరిగింది. అమ్మవారి చిత్రపటం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం బాబావారి పారాయణం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.